దాంపత్యము

శ్రీమతి చే. కామేశ్వరమ్మగారు

నారాయణమూర్తిగారొక న్యాయవాది. ఆంధ్ర భాషయందు కవిత్వ ధోరణిగల మంచి విద్వాంసుడు. ఆయన సమయమంతయు భాషాపాండిత్యమునకై వ్యయపరచుటచే ప్లీడరువృత్తియందు తగినంత రాబడి లేకుండెను. దానికి తోడుగా కుటుంబము వృద్ధియగుచున్నది. ఇంటిలో అయిదుగురు బిడ్డలను, భార్యను పోషింపవలయును.

ఆయనకు నెలకువచ్చు 60 లేక 70 రూపాయీల ఆదాయములోను దినమున కొకరూపాయి చొప్పున కాఫీహోటలులకు ఖర్చుచేయక తప్పదు. ఇంకను, అనేక పుస్తకములు కొనుట కాయన ధనము వెచ్చించుచుండును. ఇంతమందికిని యింటిఖర్చు 20 రూపాయీలుకంటె నెక్కువ పెట్టజాలకుండెను. కాఫీ హోటలు ఫలహారములును, నస్యమును గలిసి యాయన సహజ కోపస్వభావమును వృద్ధిపరచెను. ఎన్నిసార్లు కోపమువచ్చిన అన్నిసార్లు కాఫీహోటలున కెక్కువ వెళ్లుచు, తనకోపాగ్నిని కాఫీనీళ్ళతో చల్లార్చుచుండును. ఇంటిలోని కేవస్తువు కావలెనని చెప్పినను ఆయన మండిపడెడు వాడుక.

పంకజమ్మ నారాయణమూర్తిగారి భార్య. భార్యా బిడ్డల యెడల గృహయజమానుని కుండవలసిన యాదరణ, యాకుటుంబమున వెదకినను గాన్పింపకుండెను. పంకజమ్మ సహజ సత్వగుణ సంపన్నురాలు. గృహమునందు భర్తృప్రేమయు, బిడ్డలవిధేయతయు లేకుండుటచే నామె మిక్కిలి కృశించుచుండెను. దానికి తోడామె ఉబ్బసపుదగ్గుచేత తీవ్రముగ పీడింపబడుచుండెను. మరియు నామె ప్రతియేట కాన్పులచే, మిగుల నీరసించిపోయెను.

ఇట్టి పరిస్థితులలోగూడ నామె భర్తను కొంచెమైనను దూషించుట యెరుగదు. సహజ సద్గుణములకు దోడుగా, నామె చిన్నతనము నుండియు, పతివ్రతామణుల దివ్యచరిత్రములు జదువుచు, చదివిన మంచి విషయముల నాచరణయం దుంచుచుండెను. ఆమెవ్యాధి యంతకంతకు ప్రబలమగుచుండెను. భర్త తన యారోగ్యమునుగూర్చి యేమియు శ్రద్ధవహించడు. ఆయనకు గావలసిన పరిచర్య లెంతక్రమముగా జరుపుచున్నను, యేదోయొక వంక బెట్టుకొని చిరాకు పడుచు, భార్యను కొట్టుచు తిట్టుచు హింసించుచుండును. ఇంటిలో నాయనచర్య లీవిధముగ నుండెను. పైవారల కందరకును నారాయణమూర్తిగారికంటె యోగ్యు లీపృథ్విలో లేరని వదంతి.

ఒకనాటి మధ్యాహ్నము వాడుకప్రకారము, నారాయణమూర్తిగారు భోజనముచేసి సావడిలో గూర్చుండిరి. పంకజమ్మ భయపడుచు, తలుపు చాటుననుండి, పతిని పలుకరించెను.

పం:—దాసీదానికి 4 అణాలు యివ్వాలి, చాలా సార్లు అడుగుతోంది.

నా:—ఏమిటీ! నీబ్రతుక్కి నీకు నౌకర్లుగూడా కావలసొచ్చారూ? దయ్యమువలె నింటబడి తింటున్నదిచాలక నీకు దాసీలా? నావద్ద పైసాగూడ లేదు, పో, అవతలకి.

పం.—15 రోజులనుంచిదగ్గు, ఆయాసంచేత ఎక్కువ బాధగానుండి, అంట్లుమాత్రం తోమించాను. దయచేసి, యీ యొక్కసారి యివ్వండి, ఇంకెప్పుడూ యేపని చేయించను.

నా:—నీకు జన్మమున్నంతకాలం రోగాలే, నీమూలాన్ని నీ పిల్లలమూలాన్ని నా సొమ్మంతా నాశనమై పోతోంది. నాతో చెప్పకుండా నీకింత స్వతంత్రమా! ఎక్కడనుంచి తెచ్చిస్తావో తెచ్చియ్యి. నన్నుమాత్రం దబ్బడిగావంటే జాగ్రత్త. నా యెదుటినుంచి తక్షణం లేచిపో.

ఆసమయములో ఆయిల్లాలి మనస్సెంత విచారపడెనో, చెప్పవలవిగాదు. ఆమె మి[illegible]యాస

ముతో దగ్గుచు, నడువలేక, నడువలేక, అప్పలమ్మ దగ్గరకు పోయెను.

పం:—అప్పలమ్మా! నీడబ్బులు, రెండురోజులు తరువాత యిస్తాను. ఆయన చేతులో యివ్వడం సిద్ధంగా లేదట.

అప్పః:—అంత గతిలేనిదాన వెందుకు చాకిరీ చేయించుకున్నావమ్మా! పోనీ నా పావలాడబ్బులు దాచుకో, నువ్వెంత, బాగుపడుతావో చూస్తాను. ఈమా టేదేనా, పనిచెప్పతావుగాదూ, ఎప్పుడేనా చేస్తానా? పోనీ డబ్బులేకపోతే బియ్యమేనా యియ్యవమ్మా!

పం:—బియ్యముగూడ యింట్లోలేవు, సాయంత్రానికి చాలడమే చాలకష్టం.

“ఎంత దరిద్రురాలవు బయల్దేరావు, పోనీ నా ఋణాన్ని పడుంటావులే” అంటూ వీధంతా యెగిరిపోయేటట్లు తిట్లు తిడుతూ దాసీది వెళ్లుచుండగా చూసి, పంకజమ్మ నిలువున నీరైపోయింది. అయ్యో! పాపము!! పంకజమ్మస్థితికి చుట్టుపట్ల వారందరును జాలిపడుచుండిరి. దారుణమైన జబ్బుస్థితి, పైగా భర్త చేత నిరంతరమూ, తిట్లూ, దెబ్బలూ. ఇంట్లో చాలామంది పిల్లలు అనేకవిధములుగా నామెను తొందరజేయుట, సహాయపడువా రెవ్వరును లేరు. రోగభూయిష్ఠురాలగునామె, యింతమందికి గావలసిన పనులు చేయలేక బాధపడుచుండెను. పైగా పథ్యపానములకు గావలసిన పదార్థములేవియు యింటికి తీసుకొని రాడు. భోజనమువేళ ‘కిదిలే దదిలే’దని యా దీన గృహిణిని బాధించుచుండును. ఇన్నికష్టములను ఆమె మిగుల ఓర్పుతో సహించుకొనుచు “క్షమయా ధరిత్రీ” యను లోకోక్తి సార్థక పరచుచుండెను.

అది వేసవికాలము. పంకజమ్మవ్యాధి దినదినము హెచ్చుచుండెను. రాత్రులందు కొంచెమైనను నిద్ర లేదు. దగ్గుబాధవలన ఆమెకేగాక చుట్టుపట్లవారికి కూడ నిద్రాభంగ మగుచుండెను. 3 సంవత్సరముల యీడుగల యామె బిడ్డయొకడు తల్లిని పాలిమ్మని యామెముఖము రక్కుచు ఏడ్చుచుండెను. తల్లిదగ్గు, కొడుకుయేడ్పు కలసి యా వీధివారందరిని, ఆ యర్ధరాత్రమున మేల్కొలుపుటచే ఆవాడు దొంగల భయమేమియు లేకుండెను. ఆరాత్రి వేడిమి బహుతీవ్రముగనుండెను. గాలి కొంచెమైనను వీచుటలేదు. మరియు నామె పరున్న గదిలోనికి గాలివచ్చుటకు మార్గము లేదు. ఇంటి జాగ్రతకొరకు ఆభార్యను బిడ్డలను ఆ చీకటి కొట్టులో పరుండబెట్టి నారాయణమూర్తిగారు ఆరుబయట గాలిలో శయనించుట వాడుక. చల్లగాలి యంతకు తనకుమాత్రమే హక్కుభుక్తము లున్నట్లు. లోపల జరుగుచున్న గడబిడలవలన ఆయన నిద్రా సుఖమునకు భంగము వచ్చుటచే, నాయన క్రోధపరవశు డయ్యెను.

నారా:—ఏమిటాగోల? ఎవ్వరిని, నిద్రపోనివ్వదలచుకోలేదూ?

పం—నాకు విపరీతమగు బాధగానున్నది. పిల్లవాడు పాలిమ్మని హింసపెట్టుచున్నాడు. ఒక్కసారి వీనిని దగ్గరకుపిలచి, యొక పిప్పరమెంటుబిళ్ళ నిచ్చిన యూరుకొనునేమో!

నా:—ఛీ ఛీ నోరుముయ్యి! నీవుబ్రతికినన్నాళ్ళు నాకు సుఖములేదు. ప్రతిరోజు నీరోగమువలన నా నిద్ర నశిస్తోంది. ప్రాణంపోదు. మరేమి భయంలేదు లే! వాడికి పిప్పరమెంటుబిళ్ళలు, నీకు జిలేబీలు కొనిపెట్టినయెడల తినుటకు సిద్ధమే, డబ్బెక్కడనుంచి తీసుకురాగలను?

పం:—నిజమే! నామూలాన్ని మీకు చాలాశ్రమ గలుగుతోంది. ఏమిచేయ్యను మరి. మంచి వైద్యునెవ్వరినేనా పిలిపించి, మందిప్పిస్తే తగ్గుతుందేమోనని ఆశగావుంది.

నా:—మరేమియు నక్కరలేదు. పిశాచములాగ నన్ను బాధపెడుతూ వెయ్యేళ్ళు బ్రతికేటట్లున్నావు. పూర్వజన్మాన్ని యేదోమహాపాతకం జేశావు, ఇప్పుడనుభవించాలి. నేను వైద్యులకి వందలు పొయ్యలేను.

1004

పం:- పోనీండి, నెలరోజులు మా వాళ్ళింటికి పంపితే మందువ్వకు వస్తాను.

నా:—అధికప్రసంగ మెక్కువౌతోంది! నిన్ను మీ వాళ్ళింటికి పంపాలికూడానా! వాళ్ళు నువ్వు కూడా కలిసి నన్ను తిట్టడానికి. వెళ్ళేదానవు నీపిల్లల్ని తీసుకొని శాశ్వతంగా లేచిపో! మళ్ళీ నాగుమ్మ మెక్కొద్దు. నీ వాళ్ళవరేనా నిన్ను తీసుకు తయారయ్యారంటే కాళ్ళు విరగగొడు తాను.

పం:—అయ్యో! వాళ్ళని నిష్కారణంగా తిట్టడ మెందుకు?

నారా:—ఓరీ! పెద్దాడ! చోప్పొకటి తీసుకురా. ఈ రాకాశిని చావగొట్టి వీధిలోకి గెంటుతాను.

పంకజమ్మకును, ఆమెబిడ్డలకును కట్టుకొనుటకు బట్టలైనా లేవు. ఆమెకున్న బట్టలన్నిగలసి, సగము చిరిగిన రెండు పాతచీరలు మాత్రమేగలవు. అవి మాసిపోయి పీలికలు వేలాడుచుండును. ఉతుకుకొనుటకు శక్తిలేదు. చాకలికి వేసినయెడల, కట్టుకొనుటకు మరియొక బట్టలేదు. ఆమె పిల్లలందరివి పాతపీలికలే. ఇన్ని కష్టపరిస్థితు లొక్కసారి పీడించుచున్నను, ఆ సాధ్వీమణి జంకక, పరమశాంతముతో గృహకార్యములను జక్కబెట్టుకొనుచు, పతిని, పిల్లలను సంతృప్తి పరచుటకై నిరంతరము పాటుబడుచుండును.

తనకుమాత్రము గావలసిన పదార్థముల నాయన కాఫీహోటలులో తినుచు, గృహమునకు గావలసిన వస్తువులను తెప్పించుట పూర్తిగ మానెను. ఎదురుగానున్న కోమటికొట్టులో పప్పు బియ్యము మొదలగు వస్తువులను పిల్లలరువు తెచ్చుటచే, ఇంతకంతకు పద్దు వ్రాసి వర్తకుడు కొట్టింపు లాభముతీయుట మొదలుపెట్టెను. ఇంట తగిన భోజనసామగ్రి లేకపోవుటయేగాక, భోజనపు వేళకు మాత్రము తమకు కావలసినవి చేసిపెట్టలేదని యందరును ఆడినురాలిని బాధించుచుండిరి.

ఒకనాటి సాయంకాలము చీకటిపడుచున్నది. ఇల్లంతయు కటికచీకటి, దీపము వెలిగించుటకు కిరసనాయిలు లేదు. ఏమి చేయుసలయునాయని యామె చింతించుచున్న సమయమున, నారాయణమూర్తి గారు వచ్చిరి.

నా:—ఇంట్లోదీపం బెట్టడానికిగూడా శక్తిలేదా?

పం:—కిరసనాయిలైపోయింది, అందుచేత...

నా:—నా సంసారమంతా యిల్లాగే నాశనం జేస్తున్నావు. నిన్నగాక మొన్న తెప్పించిన కిరసనాయిలంతా యేంజేశావు. వేరే అమ్ముకుంటున్నట్లు కనబడుతుంటే. ఓరే, అబ్బాయీ, ఒకకాని పెట్టి కిరసనాయిలు తీసుకురా. చాలాకొంటే, యీ దరిద్రగొట్టు అంతా వొక్కనాడే ఖర్చుపెడుతుంది.

ఉదయం 7 గంటలయింది. నారాయణమూర్తి గారు కాలకృత్యాలు దీర్చుకుని, కాఫీహోటలునకు పోవుచుండిరి. అప్పు డాయన పెద్దకుమార్తె <u>లలిత</u> భయముతో దగ్గరకువచ్చి యేదో మాటాడ నుద్దేశించుచున్నట్లు తండ్రివంక జూచుచుండెను.

నా:—లలితా! వీధిలోకెందుకువచ్చావు? లోపలికి పో!

నాన్నగారూ! నన్ను బళ్లోకి పంపించరూ, పిల్లలందరూ, హాయిగా పలకాపుస్తకాలూ తీసుకొని యెంతో ముచ్చటగా బడిలోకి వెడుతుంటే; నేను, చెల్లెలూ, యేడుస్తూ పాత గుడ్డపీలికలు గట్టుకుని లోపల మొద్దులవలె కూచుంటున్నాము. చెల్లెలికి నాకు చెరియొక పరికిణీ కుట్టించరూ, బడిలోకి వెడతాము.

నా.—లోపలకి వెళ్లు వెళ్లు; మీయమ్మ చదువుకుని పాడైపోయింది. ఆడపిల్లలు చదువుకుంటే యేమీ లాభం లేకపోవడమే గాకుండా చెడ్డసహవాసాలవల్ల పాడైపోతారు. ఇంట్లోకి [illegible]ట, పని, నేర్చుకో, నడు, నడు.

తండ్రిచెప్పిన, యీ నిరాశ మందలింపులకు లలితమొగము చిన్నబోయెను. ఆమె యేడ్చుచు తల్లియొద్దకుపోయెను.

కాఫీహోటలు గుమ్మములో నారాయణమూర్తిగారు కాలుపెట్టగానే, హోటలుయజమాని కోపముతో నాయనవంక దిరిగి మాట్లాడ మొదలిడెను.

హో.య:—అయ్యా! ప్లీడరుగారూ! మాకు సొమ్మివ్వదలచుకోలేదా! ఏప్రిల్, మే, జూన్, మూడు నెలలకైన సొమ్ము యివ్వవలెను గదా! మొత్తమెంత తేలిందో చెప్పి మరీ, కాఫీపుచ్చుకోండి.

నా:—మొత్తంచేస్తా, పుస్తకమిలాగియ్య(లెక్కించి) మూడునెలల తాలూకు 86-14-0 అయింది.

హో.య:—ఇంతంత బాకీలు పెడితే, బీదవాళ్లం వ్యవహార మెట్లా చేసుకుంటాము చెప్పండి మరి. ఇదిగో మీరు వెంటనే యిస్తేనేగాని వల్లగాదు.

నా:—ఈమధ్య కోర్టుమూయడంవల్ల డబ్బు కిబ్బందిగావుంది. ఏదో ఒక బాపతుచూసి త్వరగానే యిస్తాలే. ముందు కాఫీపంపించు, నీరసంగావుంది. నారాయణమూర్తిగారు ఫలహారంజేసి వచ్చి యింటిగుమ్మ మెక్కుచుండిరి. లోపలినుండి పిల్లలందరు, బిక్కమొగములతో యేడ్చుచు, పరిగెత్తుకొని వచ్చిరి.

పిల్లలు:—నాన్నగారూ! అమ్మ నూతిదగ్గరికి నీళ్ళకోసంవెళ్లి, అక్కడ మెట్లమీద పడిపోయింది. పిలిస్తే మాట్లాడదు. ఇందాకా మాతో కోమటింటికివెళ్ళి కరక్కాయలు తెమ్మన్నది, డబ్బు లేక తీసుకురాలేదు. డబ్బివ్వకపోతే కోమటి యివ్వనన్నాడు.

నా:—మరేమీ ఫరవాలేదులే. దొంగవేషాలు నే నెరుగనా!

ప్లీడరుగారు కాలిజోడు విడిచి మెల్లిగా నూతిదగ్గరకుపోయిరి. అప్పుడే ఆమె యూర్ధ్వశ్వాసము విడుచుచుండెను. ముఖమునల్లబడిపోయి, నాడి నీరసించిపోవుచుండెను.

నారాయణమూర్తిగారికి సాధ్వీమణియగు తన పత్నియొక్క అంత్యదశను చూడగానే, యిట్టిదని వర్ణింప నలవిగాని, పశ్చాత్తాపము, దుఃఖముగల్గెను. ప్రేమరసశూన్యుడగు నాయన పాషాణహృదయము గూడ కరగినదయ్యెను. వెంటనే, యాయన తన యిల్లాలిని చేతులమీద నెత్తుకొనివచ్చి, మంచముమీద పరుండబెట్టి విసరుచు, నాడి చూచుచు, నాతురతపడుచుండెను. పిల్లలందరును చుట్టుజేరి "అమ్మా!" యని గుండె పగులునట్లేడ్చుచు నాతురతపడుచుండిరి. పంకజమ్మ యెట్లో కన్నులువిప్పి, దీనదృష్టులతో భర్తవంక చూచుచూ, నేమోచెప్పుటకు పెదవులు కదల్పబోయెను.

నా:—పంకజం! మమ్మందరిని విడిచి వెళ్లిపోతున్నావా! అయ్యో బ్రతికినన్నాళ్లూ నిన్నెన్ని బాధలేనా పెట్టాను. దుర్మార్గుణ్ణి నన్ను క్షమించవూ! నీ కిప్పు డేంగావాలి?

రోగి ఆనందముతో భర్తకంఠమును మెల్లగా కౌగలించుకొనెను.

పం:—నాధా, ధన్యురాలను. ఇప్పుడైనా, మీ నల్లని మాటలు చెవులబడినవి. స్త్రీజన్మ మెత్తినందులకు సార్థకము, తన పతియొక్క ప్రేమపూరితమగు నాదరణ పొందుటయేగాదా! ఇన్నాళ్లు కాపురముజేసి యిట్టి యానంద మెన్నడును నే ననుభవించలేదు. చాలు యింకేమీవద్దు. మీ కనేక నమస్కారాలు. మీరు నన్నెంత హింసించినను మీరే నా దైవమనుభావమే. చివర నిమిషము వరకు, మిమ్ము నిందింపకుండాచేసింది. ఓ...క్క...మాట...ఆ...న...ప...త్రి...మందు.....బ్ర...తు...కు...తా...నే...మో...పిల్ల...లు జా...గ్ర...త...

ఇలా మాట్లాడుచునే, ఆమె కన్నుల మూసుకొనెను. ఆమె కీభౌతిక ప్రపంచమందలి కష్టసుఖములతో పని లేదు. నారాయణమూర్తిగారు తెల్లబోయిరి.